క్లుప్తంగా

నామినేటెడ్ పదవులను భర్తీ చేయాలి

మచిలీపట్నంటౌన్: గత ఎన్నికల్లో కష్టపడి పని చేసిన తమకు త్వరితగతిన నామినేటెడ్ పదవులను భర్తీ చేయాలని పలువురు బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక బీజేపీ జిల్లా కార్యాలయంలో శనివారం నాలుగు మండలాలలో పార్టీ సభ్యత్వ ప్రక్రియ పూర్తి అయిన సందర్భంగా బీజేపీ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశానికి హాజరైన పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఆరు నెలలైనప్పటికీ స్థానికంగా ఉన్న నామినేటెడ్ పదవులను ఎందుకు భర్తీ చేయటంలేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు సీహెచ్ పద్మరాజు, మచిలీపట్నం నియోజకవర్గ కన్వీనర్ సోడిశెట్టి బాలాజీ, సీనియర్ నాయకులు ధూళిపాళ శ్రీరామచంద్రమూర్తి, వైవీఆర్ పాండురంగారావు, కూనపరెడ్డి శ్రీనివాస్, విశ్రాంత డీఎస్పీ శాయన సుశీలరావు, బీజేపీ మండల అధ్యక్షుడు సూరిశెట్టి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దివ్య కేసు మిస్టరీని వెంటనే ఛేదించాలి

మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు దోవా గోవర్ధన్

అవనిగడ్డ: వారం రోజుల నుంచి ఆచూకీ దొరకని మూడేళ్ల ఆవుల దివ్య కేసు మిస్టరీని వెంటనే ఛేదించాలని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు దోవా గోవర్ధన్ డిమాండ్ చేశారు. దివ్య తల్లిదండ్రులను శనివారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంటకాలువలో మునిగి ఉంటుందని భావించి చేపట్టిన గాలింపు చర్యల వల్ల ఎలాంటి ప్రయోజనం లభించలేదని, కిడ్నాప్ కోణంలో దర్యాప్తు చేయాలన్నారు.

అనారోగ్యంతో బాధపడుతున్న చిన్నారికి ఆర్థిక సాయం



చిలకలపూడి(మచిలీపట్నం): అనారోగ్యంతో బాధపడుతున్న చిన్నారి తల్లిదండ్రులకు కలెక్టర్ డీకే బాలాజీ శనివారం ఆర్థిక సాయం అందజేశారు. పెనమలూరులో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు పెనమలూరు మండలం వైకుంఠపురం గ్రామానికి చెందిన గొట్టుపల్లి నాగరాజు, రాజేశ్వరి దంపతులకు మూడు సంవత్సరాల వయసు ఉన్న తమ కుమార్తె కిడ్నీ, లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతోందని తెలియజేయటంతో ఆయన ఇచ్చిన హామీ మేరకు కలెక్టర్ బాలాజీ శనివారం రూ.2 లక్షల చెక్కును కలెక్టరేట్‌లో అందజేశారు. దీంతో పాటు ప్రభుత్వం ద్వారా పింఛను మంజూరు చేయించాలని తల్లిదండ్రులు కలెక్టర్‌ను కోరగా తక్షణమే చర్యలు తీసుకోవాలని వ్యక్తిగత సిబ్బందిని ఆదేశించారు.

తాడేపల్లి మాజీ సర్పంచ్ తాతా సీతారామయ్య మృతి



తాడేపల్లి(ఘంటసాల): వైఎస్సార్‌సీపీ నేత, మండలంలోని తాడేపల్లి గ్రామ మాజీ సర్పంచ్ తాతా సీతారామయ్య(65) అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం రాత్రి మరణించారు. సర్పంచ్ పడమట సీతామహాలక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వేమూరి వెంకట్రావు, వైఎస్సార్‌సీపీ సేవాదళ్ మండల అధ్యక్షుడు దిరిశం పిచ్చేశ్వరరావు, పలువురు పార్టీ నేతలు సీతారామయ్య భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సీతారామయ్య తాడేపల్లి గ్రామసర్పంచ్‌గా, గీత కార్మిక సంఘం అధ్యక్షుడిగా, కొత్తపల్లి పీఏసీఎస్ చైర్మన్‌గా పని చేశారు.

అంతుచిక్కని వ్యాధితో నాటుకోళ్ల మృత్యువాత

మోపిదేవి: అంతుచిక్కని వ్యాధి సోకి నాటుకోళ్లు మృత్యువాత పడుతున్నాయని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఇన్‌ఫెక్షన్ సోకిన గంటలోపే ఎక్కడ కోడి అక్కడే చనిపోతున్నాయి. మండలంలో ఈ విధంగా సుమారు 100కు పైగా మృత్యువాత పడినట్లు సమాచారం. దీనిపై మండల వెటర్నరీ వైద్యుడు డాక్టర్ నందకిషోర్‌ను సంప్రదించగా నాటు కోళ్లు మృత్యువాత పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇన్‌ఫెక్షన్ సోకిన వెంటనే ఆ కోడి అటు ఇటు కదలలేక తల వంచి పడిపోయి కొంచెం సేపటికే చనిపోతోందని తెలిపారు. ఇది బ్యాక్టీరియా ఇన్‌ఫెక్షన్ వల్ల వస్తుందని, ఈ వ్యాధి సోకిన కోడిని మిగతా కోళ్లతో కలవకుండా దూరంగా ఉంచి, వెంటనే వెటర్నరీ వైద్యులను సంప్రదించాలని సూచించారు.

రైతుల అభివృద్ధికి నిరంతరం కృషి చేయాలి

ఘంటసాల: రైతుల అభివృద్ధికి నిరంతరం కృషి చేయాలని గుంటూరు లాం వ్యవసాయ విస్తరణ సంచాలకుడు డాక్టర్ జి.శివనారాయణ అన్నారు. ఘంటసాలలోని కృషి విజ్ఞాన కేంద్రాన్ని శనివారం సాయంత్రం ఆయన సందర్శించారు. కేవీకేలో శాస్త్రవేత్తల పనితీరు, కార్యాచరణ ప్రణాళిక, రైతులకు అందిస్తున్న సేవల గురించి కేవీకే సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి తో మాట్లాడి తెలుసుకున్నారు. అనంతరం స్వచ్ఛత పక్షోత్సవాల్లో భాగంగా మొక్క నాటారు.

సంక్షేమ సారథి వైఎస్ జగన్

- పెడనలో జగన్ జన్మదిన వేడుకలలో కేక్ కట్ చేసిన జెడ్పీ చైర్‌పర్సన్ హారిక దంపతులు
- అవనిగడ్డ, చల్లపల్లి, మోపిదేవిలో వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు
- మచిలీపట్నం రూరల్ గ్రామాల్లో జగన్ జన్మదిన వేడుకలు

మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను శనివారం మచిలీపట్నం, పెడన, అవనిగడ్డ అసెంబ్లీ నియోజకవర్గాల్లోని వివిధ మండల కేంద్రాలు, గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. పలుచోట్ల వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పండ్లు, రొట్టెల పంపిణీ, రక్తదానం వంటి పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు.



నాగాయలంకలో శనివారం రాత్రి జరిగిన వైఎస్ జగన్ మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు



చల్లపల్లిలో కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు



పెడనలో కేక్ కట్ చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ హారిక, ఉప్పాల రాము

పెడన: సంక్షేమ ఫలాల సారథి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని, జగనన్న సీఎంగా ఉండి ఉంటే ఈ పాటికి తమకు సంక్షేమ ఫలాలు అంది ఉండేవని పేదలందరూ అనుకుంటున్నారని వైఎస్సార్ సీపీ పెడన నియోజకవర్గ ఇంఛార్జి ఉప్పాల రమేష్(రాము) అన్నారు. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను పెడన వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారికతో కలిసి రాము కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. అనంతరం బంటుమిల్లి రోడ్డులోని డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి కేక్ కట్ చేశారు. పెడన పీహెచ్‌సీలోని రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీలు సంగా మధుసూదనరావు, కూనసాని గరుడప్రసాద్, వెలివెల చినబాబు, జెడ్పీటీసీలు వేముల సురేష్ రంగబాబు, మైలా రత్నకుమారి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు కొండవీటి నాగబాబు, వైదాని వెంకట్రాజు, పర్ణం పెదబాబు, పెడన పట్టణ అధ్యక్షుడు బండారు మల్లి, పార్టీ నాయకులు, పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ ఖాజా ఆధ్వర్యంలో శనివారం వేకువ జామున పెడన 5వ వార్డులో మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించారు. యువత పెద్ద ఎత్తున పాల్గొని కేక్ కట్ చేసి జై జై జగన్ అంటూ నినాదాలు చేశారు.

నాగాయలంకలో...

నాగాయలంక ప్రధాన కూడలిలో మండల పార్టీ అధ్యక్షుడు భోగాది శేషగిరిరావు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మద్ది చిన్నారి కేక్ కట్ చేశారు. వైఎస్సార్ సీపీ నాయకుడు చిట్టా బాల బాపారావు రూ.2,116, పార్టీ జిల్లా బీసీ సెల్ నాయకుడు చెన్ను రంగారావు రూ.2,000 కలిపి మొత్తం రూ.4,116 నగదును డిగ్రీ చదువుతున్న పేద విద్యార్థిని చుండూరు మోహన సాయిప్రియకు అందజేశారు. పార్టీ యూత్ జిల్లా కార్యదర్శి ఆకుల బాబీకుమార్ నేతృత్వంలో స్థానిక పీహెచ్‌సీలో రోగులకు, వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు.

అవనిగడ్డలో...

అవనిగడ్డ: స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద శనివారం మాజీ శాసన సభ్యుడు సింహాద్రి రమేష్‌బాబు కేక్ కట్ చేశారు. స్థానిక ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో యువ నాయకుడు సింహాద్రి వికాస్ రోగులకు పండ్లు, రొట్టెలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ కడవకొల్లు నరసింహారావు, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, అవనిగడ్డ, ఘంటసాల మండల కన్వీనర్లు రేపల్లె శ్రీనివాసరావు, వేమూరి వెంకట్రావ్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గుర్రం బసవయ్య, ఎస్సీసెల్ నాయకుడు పృథ్వీరాజ్ పాల్గొన్నారు.

- **మచిలీపట్నంరూరల్‌లో...**

కోనేరుసెంటర్: బందరు మండలం చిట్టిపాలెం గ్రామంలో శనివారం రాత్రి గ్రామస్తులు కేకు కట్ చేశారు. చండిక అజయ్ ఆధ్వర్యంలో స్వీట్లు పంచిపెట్టారు. మాజీ ఎంపీటీసీ సూర్యారావు, కందిమళ్ల అజయ్‌కుమార్, గంగిశెట్టి సురేష్ తదితరులు పాల్గొన్నారు. రుద్రవరంలో కేకు కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో గ్రామ ఇన్‌చార్జ్ అంగడాల ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు. సిరివెళ్ళపాలెంలో గ్రామస్తులకు స్వీట్లు పంచిపెట్టారు. నెలకుర్రులో కేకు కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు.

- **కోడూరులో...**

కోడూరు: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఆ పార్టీ శ్రేణులు శనివారం ఘనంగా నిర్వహించారు. పార్టీ ఆధ్వర్యంలో కోడూరు ప్రధాన సెంటర్‌లో జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన కేక్‌ను కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. లింగారెడ్డిపాలెం, వి.కొత్తపాలెం, ఉల్లిపాలెం, మాచవరం, విశ్వనాథపల్లి, మందపాకల, రామకృష్ణాపురం గ్రామాల్లో పార్టీ నేతలు కేక్‌లు కట్ చేసి బాణసంచా కాల్చారు. ముందుగా వంతెన సెంటర్‌లోని దివంగత మహానేత రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. యువనేత సింహాద్రి వికాస్, జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకట సత్యన్నారాయణ, పార్టీ మండల కన్వీనర్ పరిశె మాధవరావు, జిల్లా రైతు విభాగం కార్యదర్శి కొండవీటి వీరవెంకట నారాయణరావు, ఎంపీటీసీ బడే గంగాధరరావు, విశ్వనాథపల్లి సర్పంచి కొప్పనాతి శేషుబాబు, పార్టీ నేతలు కోట పద్మావతి వరప్రసాద్, వెన్నా ప్రసాద్, కటకం కుటుంబరావు, బండే నాగరాజు, వి.శ్రీనివాసరావు, చేబోయిన కృష్ణారావు, చిలకలపూడి ధర్మయ్య, దేవనబోయిన ప్రసాద్, ఆకురాతి తాతయ్య, తిమ్మన శివ తదితరులు పాల్గొన్నారు.

మోపిదేవిలో...

మోపిదేవి: మండల కేంద్రం మోపిదేవి ప్రధాన సెంటర్‌లో మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. దివి మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ కడవకొల్లు నరసింహారావుతో కలిసి అవనిగడ్డ మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు భారీ కేక్ కట్ చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు లింగం జగదీష్ కుమార్, చోడాబత్తిన పూర్ణచంద్రరావు, బండారు సూరిబాబు, రాజులపాటి నాగేశ్వరరావు, మత్తి వెంకట సత్యనారాయణ, జన్యావుల రామ్మోహనరావు, రెడ్డాతు రాంప్రసాద్, కె.మాధవరావు, నందిగం శ్రీనివాసరావు, గొరిపర్తి గోవిందరాజులు, అరజా వెంకట సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



నెలకుర్రులో వైఎస్ జగన్ పుట్టిన రోజు వేడుకలను జరుపుతున్న పార్టీ నాయకులు

బంటుమిల్లిలో వైఎస్సార్ సీపీ అభిమానుల రక్తదానం

బంటుమిల్లి: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 30 మంది యువకులు రక్తదానం చేశారు. మచిలీపట్నం రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంకు ప్రతినిధులు రక్త సేకరణ చేశారు. మండల పార్టీ అధ్యక్షుడు సుజ్ఞానం మహేష్ పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో తొలుత కేక్ కట్ చేసి జగనన్నకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఒడిమి చిన్నారిబాబు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



శిబిరంలో రక్తదానం చేస్తున్న యువకులు

లింగ నిర్ధారణ పరీక్షలు చట్ట వ్యతిరేకం

డీఎం అండ్ హెచ్‌వో గీతాబాయి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌వో గీతాబాయి

చిలకలపూడి(మచిలీపట్నం): స్కానింగ్ కేంద్రాల్లో లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించటం చట్టరీత్యా నేరమని దీనిని అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎంఅండ్‌హెచ్‌వో జి.గీతాబాయి హెచ్చరించారు. తన చాంబర్‌లో శనివారం సాయంత్రం ఆమె పీసీపీఎన్‌డీటీ చట్టంపై జిల్లాస్థాయి సలహా సంఘ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్కానింగ్ కేంద్రాల్లో లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహించే వారిపై మాత్రమే కాకుండా అడిగిన వారు, ప్రోత్సహించిన వారిపై కూడా చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలోని స్కానింగ్ కేంద్రాలన్నీ తప్పనిసరిగా నమోదు చేసుకుని ప్రతి ఐదేళ్లకొకసారి రెన్యువల్ చేసుకోవాలన్నారు. ప్రతి స్కానింగ్ కేంద్రంలో ధరల పట్టిక, హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో తనిఖీ బృందాలను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తామన్నారు. ప్రస్తుతం జిల్లాలో 85 స్కానింగ్ కేంద్రాలు ఉండగా వాటిలో 11 ప్రభుత్వ, 74 ప్రైవేటు కేంద్రాలు ఉన్నాయన్నారు. సమావేశంలో వైద్యులు రోజా, హారిక, వినీల్, వైవీడీ మహేష్, జీవీ భారతి, స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు కె.సుశీల, ఎన్.ధర్మతేజ, పి.వెంకటేశ్వరరావు, లీగల్ కన్సల్టెంట్ పి.మస్తానమ్మ పాల్గొన్నారు.

క్రీడా సౌకర్యాలు పెంచుతాం

కేయూ ఉప కులపతి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి శ్రీనివాసరావు

కోనేరుసెంటర్: కృష్ణా విశ్వవిద్యాలయంలో క్రీడా సౌకర్యాలు పెంచడానికి చర్యలు చేపట్టామని ఉపకులపతి ఆచార్య ఆర్.శ్రీనివాసరావు అన్నారు. ఫిట్ ఇండియా వారోత్సవాలను పురస్కరించుకుని విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో విజేతలకు శనివారం జరిగిన బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల జరిగిన నాక్ బృందం పర్యటన నేపథ్యంలో విశ్వవిద్యాలయ ప్రాంగణంలో పలు క్రీడా పరికరాలు ఏర్పాటు చేశామని చెప్పారు. భవిష్యత్‌లో మరిన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. రెక్టార్ ఆచార్య ఎంవీ బసవేశ్వరరావు మాట్లాడుతూ అంతర్ విశ్వవిద్యాలయ స్థాయిలో కృష్ణా విశ్వవిద్యాలయం ప్రత్యేకత నిలుపుకొంటూ వస్తోందన్నారు. ఎన్ఎస్ఎస్ విభాగం సమన్వయకర్త డాక్టర్ ఎం.శ్రావణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కె.శోభన్ బాబు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం విజేతలకు ఉపకులపతి, రెక్టర్, రిజిస్ట్రార్ బహుమతులు అందజేశారు.

సెల్‌ఫోన్‌తో మహిళలు అప్రమత్తంగా ఉండాలి

మొవ్వ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ పి.ఉదయ్ ప్రకాశ్ రాజన్

ఘంటసాల: సెల్‌ఫోన్లతో మహిళలతో పాటు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మొవ్వ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ పి.ఉదయ్ ప్రకాష్ రాజన్ అన్నారు. ఘంటసాల మండల పరిషత్ కార్యాలయ సమావేశపు హాలులో శనివారం మహిళా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలకు జరుగుతున్న అన్యాయాలు, అరాచకాలు, లైంగిక వేధింపులు, చిన్నారులపై జరుగుతున్న లైంగిక దాడుల్లో చట్టాలు కల్పిస్తున్న రక్షణ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వ్యవస్థల గురించి తెలియజేశారు. మహిళలు ఏమైనా సమస్యలుంటే న్యాయసేవ సంస్థను సంప్రదిస్తే న్యాయ సలహాలు, సహకారం అందిస్తామని చెప్పారు. అనంతరం మహిళలకు చేతి సంచులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఘంటసాల ఎస్‌ఐ కె.ప్రతాప్ రెడ్డి, లాయర్లు పోతుల వెంకట శివ శ్రీనివాస్, బొల్లా అశోక్ వర్ధన్, డీఎల్ఎస్‌సీ మెంబర్లు గొరిపర్తి శ్రీనివాసరావు, మారెం సరస్వతి, మండల సమాఖ్య మహిళలు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికే సదస్సులు

ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్



కొంకేపూడి రెవెన్యూ సదస్సులో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

పెడన: పట్టణంతో పాటు గ్రామాల్లో కూడా రెవెన్యూ సమస్యలు అధికంగా ఉన్నాయని గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా రెవెన్యూ సదస్సులు నిర్వహించి ఆయా సమస్యలను పరిష్కరించేలా చర్యలు చేపట్టిందని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. మండలంలోని కొంకేపూడి గ్రామ సచివాలయం వద్ద శనివారం జరిగిన రెవెన్యూ సదస్సుకు ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సదస్సులలో భూ సమస్యలతో పాటు క్యాస్ట్ సర్టిఫికెట్లను కూడా ఇస్తున్నారని చెప్పారు. ప్రజలు భూ సమస్యలను అధికారులకు అర్జీల రూపంలో తెలియజేస్తే 50 రోజుల్లో పరిష్కారం చూపుతారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పెడన జెడ్పీటీసీ అర్జా వెంకట నగేష్, టీడీపీ మండల అధ్యక్షుడు శెలపాటి ప్రసాద్, శీరం ప్రసాద్, ఇన్‌చార్జి తహసీల్దార్ కె.అనిల్ కుమార్, మండల సర్వేయర్ దాసు, రీసర్వే డీటీ సల్మా, కొంకేపూడి వీఆర్వో మౌలాలి, ఆయా గ్రామాల వీఆర్వోలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

వైభవంగా శిడిబండి ఊరేగింపు

పెడన: పట్టణంలోని శ్రీపైడమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు శనివారం ఎనిమిదో రోజున స్థానికులు శిడిబండ్లకు పసుపు రాసి వేపాకులు కట్టి సుందరంగా అలంకరించి బొమ్మలు కట్టి నృత్యాలు చేస్తూ అమ్మవారి ఆలయానికి చేరుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. పట్టణంలోని భట్ల జ్ఞానకోటయ్య జెడ్పీహెచ్ఎస్‌లో 1975–76వ సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ప్రత్యేకంగా శిడిబండి కట్టి కోలాట ప్రదర్శన నిర్వహించారు. శ్రీరుక్మిణీ సత్యభామా ఆలయం నుంచి ప్రారంభమై పట్టణంలోని వివిధ కూడళ్లలో కోలాట ప్రదర్శన నిర్వహించి ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. బొడ్డు రామ్మూర్తి, మల్లంపల్లి శ్రీనివాసరావు, చందన నారాయణరావు, సిద్ధినేని భాస్కర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు

మచిలీపట్నంటౌన్: జాతీయ వినియోగదారుల వారోత్సవాల సందర్భంగా స్థానిక లేడీ యాంప్తిల్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం కృష్ణాజిల్లాలోని ఉన్నత పాఠశాలలకు చెందిన ఎనిమిది, తొమ్మిది, పది తరగతుల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విజేతలకు డీఈఓ పీవీజే రామారావు, డీవైఈవోలు బి.శేఖర్‌సింగ్, ఐ.పద్మరాణి అభినందనలు తెలిపారు.

విజేతలు వీరే...

ఇంగ్లిషు మీడియంలో వ్యాసరచన పోటీల్లో మచిలీపట్నం లేడీ యాంప్తిల్ హైస్కూల్‌కు చెందిన షేక్ అబేద ప్రథమ, పెడన బీజీకే హైస్కూల్‌కు చెందిన బి.శరణ్య ద్వితీయ, పెడన విశ్వభారతి హైస్కూల్‌కు చెందిన ఆర్.జ్యోతిక తృతీయ బహుమతులను పొందారు. తెలుగు మీడియంలో లింగారెడ్డిపాలెం హైస్కూల్‌కు చెందిన కె.అర్చన ప్రథమ, జైహింద్ సెకండరీ హైస్కూల్‌కు చెందిన టి.వెంకటేశ్వరమ్మ ద్వితీయ, ఘంటసాల హైస్కూల్‌కు చెందిన డి.జ్యోత్స్ననాగ కుమారి తృతీయ బహుమతులను పొందారు. వక్తృత్వ పోటీల్లో ఇంగ్లిషు మీడియంలో నిర్మలా హైస్కూల్‌కు చెందిన పి.బ్రాహ్మణి ప్రథమ, లింగారెడ్డిపాలెం హైస్కూల్‌కు చెందిన జి.దివ్యశ్రీ ద్వితీయ, శ్రీ బాలాజీ విద్యాలయంకు చెందిన ఎండీ నఫీసున్నీసా తృతీయ స్థానాలు పొందారు. తెలుగు మీడియంలో పెడన విశ్వభారతి హైస్కూల్‌కు చెందిన పి.దేవీ మహీక్షిత ప్రథమ, శ్రీ బాలాజీ విద్యాలయంకు చెందిన పి.శ్రీలాస్య ద్వితీయ, లింగారెడ్డిపాలెం హైస్కూల్‌కు చెందిన బి.మహేశ్వరి తృతీయ స్థానం పొందారు.

ఆకట్టుకున్న జగన్ ఆర్మీ బ్యానర్



ఘంటసాలపాలెం ప్రధాన రహదారి పక్కన ఏర్పాటుచేసిన జగనన్న బ్యానర్

ఘంటసాల: ఘంటసాల మండలం ఘంటసాల పాలెం గ్రామంలో శనివారం జగన్ ఆర్మీ ఆధ్వర్యంలో ప్రధాన రహదారి చెరువు పక్కన ఏర్పాటు చేసిన బ్యానర్ ప్రజలను ఆకట్టుకుంది. పదవులు ఉన్నంత వరకు కాదు – ప్రాణం ఉన్నంత వరకు నీతోనే అన్న... పేదోడి బ్రతుకు కోసం, ఆత్మ గౌరవం కోసం ఆలోచించిన నాయకుడా... జన హృదయనేత నీకు ఇవే మా హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు – ఘంటసాలపాలెం అన్న అక్షరాలతో ఏర్పాటుచేసిన ఈ బ్యానర్‌పై జగనన్న ఫొటోలతో పాటు గుడ్‌లక్ జగనన్న అని పేర్కొన్నారు.

- **గూడూరులో...**

గూడూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు గూడూరు మండలంలో ఘనంగా నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు పర్ణం మహాలక్ష్మయ్య నాయుడు ఆధ్వర్యంలో శనివారం రాత్రి మల్లవోలు ఎస్సీ కాలనీలో నిర్వహించిన వేడుకలకు ఎంపీపీ సంగా మధుసూదనరావు ముఖ్యఅతిథిగా హాజరై కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కారుమంచి కామేశ్వరరావు, పార్టీ నాయకులు కనపర్తి రాజు తదితరులు పాల్గొన్నారు.

- **ఘంటసాలలో...**



ఘంటసాల క్రిస్టియన్‌పేటలో కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వెంకట్రావు

ఘంటసాల: ఘంటసాల క్రిస్టియన్‌పేటకు చెందిన పైడిపాముల రవిశంకర్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేక్‌ను మండల పార్టీ అధ్యక్షుడు వేమూరి వెంకట్రావు కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. చిన కళ్లేపల్లి, శ్రీకాకుళం, చిట్టూర్పు, జోడుగూడెం గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులు, నేతలు, యువకులు జగనన్న జన్మదిన వేడుకలు నిర్వహించారు.

- **చల్లపల్లిలో...**

చల్లపల్లి ప్రధాన సెంటర్‌లో మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, ఏఎంసీ చైర్మన్ కడవకొల్లు నరసింహారావు, యువనాయకుడు సింహాద్రి వికాస్ కేక్ కట్ చేసి నాయకులు, కార్యకర్తలకు పంపిణీ చేశారు. అనంతరం జెడ్పీటీసీ రాజులపాటి కళ్యాణి–రాజులపాటి ప్రసాద్ ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని సింహాద్రి రమేష్‌బాబు ప్రారంభించారు. చల్లపల్లి ప్రభుత్వ వైద్యశాలలో సింహాద్రి వికాస్ రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు.